manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 170 | శనివారం | 30.11.2024








## పోరాటం, త్యాగం..

# జనగామ వారసత్వం

- జిల్లాలో ఒక్కో ఊరిది ఒక్కో చరిత్ర
- తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం పడ్డది ఇక్కడే
- కడియం సిగ్గు ఉంటే రాజీనామా చేయ్
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

2 లో



రేవంత్ రెడ్డి

## తెలంగాణ ద్రోహి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



కడియం శ్రీహరి

## ఓ గుంట నక్క

- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ

General News



# పోరాటం, త్యాగం..
# జనగామ వారసత్వం

- జిల్లాలో ఒక్కో ఊరిది ఒక్కో చరిత్ర
- తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం పడ్డది ఇక్కడే
- కడియం సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయ్
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ అంటే.. పోరాటాల గడ్డ.. ఇక్కడి ప్రజలకు పోరాటం, త్యాగం, తెగువ ఓ వారసత్వంగా వచ్చినవే తప్ప.. ఎవరు నేర్పిస్తే.. ఎవరో చూస్తే కాదు.. అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి నేటితో 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ ఎస్ శ్రేణులు దిక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నాయకత్వంలో నెహ్రూ పార్క్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ముందుగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ తొలి ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య, జనగామ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ పాల్గొన్నారు. అనంతరం చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ జనగామ ప్రాంత గులాబీ కార్యకర్తలు నివురుగప్పిన నిప్పులాగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాలు తెలంగాణ కోసం పోరాటం చేశాయని, కానీ ఏ ప్రాంతాలు జనగామకి దీటుగా రావన్నారు. జిల్లాలో ఏ గ్రామంలో ఏ వాడకు వెళ్లినా అనేక త్యాగాలు చేసిన వారు ఉన్నారన్నారు. వారి త్యాగాలకు గ్రామాల్లో ఉన్న స్థూపాలే చిహ్నం అన్నారు. జనగామ ప్రాంతంలో ఒక్కో ఊరికి ఒక్కో చరిత్ర ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి భీజం పడిన గడ్డ జనగామ అన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలయ్య, షేక్ బందగీ లాంటి తెలంగాణ సాయధు పోరాట యోధులు పుట్టిన గడ్డ జనగామ అన్నారు. సలాఖ్ పూర్, బైరాన్ పల్లి, కూటిగల్, పాలకుర్తికి ప్రత్యేక చరిత్ర ఉందని గుర్తుచేశారు. తెలంగాణ తొలి, మలి దశ పోరాటంలో తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ ప్రాంత ప్రజలు కీలక పాత్ర పోషించారన్నారు. ఇక్కడి పేదల జీవన విధానం మారాలని ఆనాడు పోరాటం చేసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకమైన మలుపు తిప్పిన రోజు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన 2009 నవంబర్ 29 చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోతుందన్నారు. దీనిని భావితరాలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## కడియం శ్రీహరికి సిగ్గుందా..

గులాబీ జెండాపై గెలిచి పార్టీ మారిన కడియం శ్రీహరికి సిగ్గు, శరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. కడియం శ్రీహరి ఘన్‌పూర్, జనగామ, వరంగల్‌లో ఎక్కడ ఏమి చేసింది లేదని, కేవలం తన కుటుంబం, బిడ్డ, అల్లుడు కోసం మాత్రం పనులు చేస్తాడని ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ వంద పడకల హాస్పిటల్, రోడ్లు, స్కూల్, మునిసిపాలిటీ ఇవ్వన్నీ తాను, మాజీ ఎమ్మెల్యే రాజన్న ఇద్దరం కలిసి తెచ్చినవే తప్ప కడియం తెచ్చింది ఏమిలేదన్నారు. జనగామ, పాలకుర్తి, ఘన్‌పూర్‌లో అభివృద్ధి చేసింది కేవలం బీఆర్ ఎస్ పార్టీయే అన్నారు. కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఉద్యమకారులు, బీఆర్ఎస్ సీనియర్ లీడర్లు గద్దెల నర్సింగరావు, మేకల కలింగరాజు, బక్క నాగరాజు, బాల్దె సిద్దిలింగం, కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బండ పద్మ, అనిత, పేర్ని స్వరూప, ముస్త్యాల దయాకర్, జిల్లా నాయకులు తిప్పారపు విజయ్, ఉల్లెంగుల సందీప్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



# రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్..!

- సోనియా నాడు బలిదేవత.. ఇప్పుడేమో అమ్మంట!
- తెలంగాణ ద్రోహి తెలంగాణను ఏలుతున్నడు
- పాలకుర్తి వాళ్లు మోసపోయి ఆగమైండ్రు
- నేను ఓడిపోతానని ముందే తెలుసు
- తప్పకుంటా అంటే కేసీఆర్ వద్దన్నడు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** 'రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్.. తెలంగాణ ద్రోహి.. నాడు సోనియా గాంధీని బలిదేవత అన్న నోటితోనే ఇప్పుడు అమ్మాఅమ్మా అని మొక్కుతుండు..' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. జనగామలో జరిగిన దీక్షాదివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాటం చేయడని వాడు, తెలంగాణ ద్రోహి అయిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రాష్ట్రాన్ని ఏలుతూ నీతివాఖ్యాలు పలుకుతున్నాడని మండిపడ్డారు. తాను టీడీపీలో ఉన్న సమయంలో తెలంగాణ కోసం 15 మంది ఎమ్మెల్యేలు లేఖ ఇచ్చేందుకు వెళితే.. రేవంత్‌రెడ్డి మాత్రం తప్పించుకుని పోయాడని ఆరోపించారు. ఆయన తెలంగాణ కోసం ఏనాడు పోరాటం చేయలేదన్నారు. ఇందిర గాంధీ, రాజశేఖర్‌రెడ్డి, పీవీ నర్సింహారావు, సోనియాగాంధీ ఇలా అందరినీ తిట్టిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నాడంటూ దయాకర్‌రావు ఎద్దేవా చేశారు.

## పాలకుర్తి వాళ్లే అన్యాయం చేసిడ్రు..

బీఆర్ఎస్ పార్టీకి జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు భరోసా ఇచ్చారని, కానీ తమ పాలకుర్తి వాళ్లే పార్టీకి అన్యాయం చేశారని దయాకర్‌రావు అన్నారు. ఏడు సార్లు తనను గెలిపించి వారు ఈ సారి కొత్తవారు వస్తే తమకు ఏదో జరుగుతుందని భ్రమపడ్డారన్నారు. మరో వైపు రూ.4 వేల పింఛన్, రైతు భరోసా పెంపు, తులం బంగారం వంటి రేవంత్‌రెడ్డి దొంగ మాటలు నమ్మి మోసపోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. కానీ ఇప్పుడు జనం కళ్లు తెరుచుకున్నాయన్నారు. ఇటీవల వరంగల్‌కు వచ్చిన రేవంత్ రెడ్డి పాలకుర్తిలో ఓ రాక్షసుడిని ఓడించారని చెప్పుకున్నాడని.. బిడ్డా దమ్ముంటే ఇప్పుడు రా.. బయటకు ఎవరు రాక్షసుడో జనం చెబుతారని దయాకర్‌రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని దయాకర్‌రావు భరోసా ఇచ్చారు.

# కడియం ఓ గుంట నక్క

- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య

**జనగామ, మన చౌరాస్తా :** 'కడియం శ్రీహరి ఓ నమ్మక ద్రోహి.. గుంట నక్క.. అవకాశవాది.. దుష్టుడు.. దుర్మార్గుడు..' అంటూ మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. జనగామలో జరిగిన దిక్షాదివస్ సభలో ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ముందున్న ఏకైక వ్యక్తి తాని చెప్పకొచ్చారు. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన ఉద్యమంలో తాను ఓ సైనికుడిని కావాలనే నాడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లోకి వచ్చానని పేర్కొన్నారు. కానీ.. కడియం శ్రీహరి గులాబీ జెండాపై గెలిచి నమ్మక ద్రోహం చేసి బిడ్డ ఎంపీ టికెట్ కోసం



పార్టీ మారిన దుర్మార్గుడు అని దుయ్యబట్టారు. కడియంకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు.

General News




# స్టేషన్ ఘనపూర్ అభివృద్ధిపై దృష్టి

## – ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి ఘనపూర్ (స్టేషన్) ఎంఎల్ఏ కడియం శ్రీహరి రెవెన్యూ, నీటి పారుదల, విద్య, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబందించిన వివిధ అంశాల మీద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఘనపూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్ వరకు ప్రధాన కాలువ లేనందున చివరి సాగు భూములకు నీరు అందడం లేదని, అందుకోసం నీటిపారుదల శాఖ కాలువ కోసం పూడిక తీసి, లైనింగ్ కు ఈ నెల 27న రూ.148 కోట్ల 76 లక్షలను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. దీంతో రైతులకు చివర భూములకు వరకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ సంక్షేమం కోసం పలు విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు లభించాయని, ఇందులో భాగంగా ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.45 కోట్ల 55 లక్షల అంచనా వేశామని, అందుకు టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమీకృత డివిజనల్ స్థాయి కార్యాలయాల సముదాయానికి రూ. 26 కోట్లు మంజూరయ్యాయని, స్థలాన్ని పరిశీలించి, భవన నిర్మాణానికి అవసరమైన డిజైన్ ను రూపొందించాలని, టెండర్ లకు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల భవన సముదాయానికి రూ. 200 కోట్ల వరకు అంచనా వేశామని, అందుకు తగ్గట్లుగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఒకే దాంట్లో 4 నుంచి 6 వరకు ఇన్స్టిట్యూషన్ లు ఉంటాయని, కోణాచలం వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని 21 ఎకరాల భూమి కేటాయించడం జరిగిందని, ఇందుకు సంబంధించిన డిజైన్, టెండర్ ల ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డీఈఈ ఎన్పీడీసీఎల్ భవన సముదాయం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించాలన్నారు. సమీకృత శాఖాహార, మాంసాహార అంగడి భవన సముదాయానికి ఘనపూర్ నుంచి శివునిపల్లి వెళ్లే మార్గ మధ్యలో ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని, అందుకు తగిన లే అవుట్ తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. త్వరలోనే ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గాన్ని మున్సిపాలిటీ గా ప్రకటించే అవకాశం ఉన్నందున, ఎంపీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే కార్యాలయానికి మార్చాలని, ఈ ఖరీఫ్ సీజన్ లో అత్యధిక రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లలో, రూ. 500 బోనస్ రైతుల ఖాతాల్లోకి జమ చేయడంలో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు.

కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం స్టేషన్ ఘనపూర్ కి మంజూరు చేసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల వల్ల నియోజకవర్గ రూపు రేఖలు మారానున్నాయని తెలిపారు. సమీక్షకు ముందు కలెక్టర్, ఎమ్మెల్యే పడకల ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని, అలాగే యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ వేణుమాధవ్, డీఎంహెచ్ఓ మల్లికార్జున్ రావు, ఈఈ పీఆర్ శ్రీనివాస రావు, డీపీఓ స్వరూప, విద్యా శాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు.

# ప్రజా సంకల్ప దీక్షకు తరలి రావాలి



**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమంలో కుల సంఘాలు కీలకపాత్ర పోషించాలని కుల సంఘాల జేఏసీ ప్రతినిధి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లిగారి యాదగిరి, మాల మహా నాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, జేఏసీ అధికార ప్రతినిధి అందె అశోక్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం చేర్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత అస్తిత్వం ఉనికి కోసం అన్ని కుల సంఘాలు ఏకమై చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. 30న నేడు చేర్యాల పట్టణంలోని అంగడి బజార్ అంబేద్కర్ సర్కిల్ వద్ద జరిగే ప్రజా సంకల్ప దీక్షకు నాలుగు మండలాల కుల సంఘాల నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు తడక లింగమూర్తి, గౌడ సంఘం నాయకులు అంబటి అంజయ్య గౌడ్,కురుమ సంఘం నాయకులు జంగిలి యాదగిరి, రెడ్డి సంఘం నాయకులు మిట్టపల్లి నర్సిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాకాల ఇసాక్, సనవాల ప్రసాద్, కార్యాలయ కార్యదర్శి బండి శ్రీనివాస్, రైతు సంఘాల సమన్వయ కర్త కత్తుల భాస్కర్ రెడ్డి, జేఏసీ మండల నాయకులు పోతుగంటి ప్రసాద్, కనకయ్య పాల్గొన్నారు.



# మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ను శుక్రవారం ఎంపీడీవో మల్లికార్జున్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, ప్లే గ్రౌండ్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్న బియ్యం ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని ఎంపిడివో పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆహార పదార్థాలు, భోజనం వండేందుకు వినియోగించే పదార్థాలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. స్టోర్ రూమ్ లో గోధుమ పిండి, ఇతర ప్యాకెట్లు తెరిచి ఉండడాన్ని గమనించిన ఎంపీడీవో వాటిని కలుషితం కాకుండా జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి నర్సింహచారి ఉన్నారు.



# అనాథ పిల్లలకు దాతల సాయం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** తలో చేయేస్తే ఆపదలో ఉన్నవారికి ఆసరాగా ఉంటామని నిరూపించారు పలువురు దాతలు. ఇటీవల తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలకు చెందిన వర్షిత్, శ్రీవల్లికి దాతలు పెద్ద మొత్తంలో చేయూత అందించారు. దాతలు వివిధ రూపాల్లో సమకూర్చిన రూ.5 లక్షల చెక్కును మహాత్మా హెల్పింగ్ హాండ్స్ సంస్థ అధ్యక్షుడు గంటా రవీందర్ శుక్రవారం పిల్లలకు అందజేశారు. పిల్లల భవిష్యత్తుకు సహకరించిన దాతలతో పాటు ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేవలం నెల రోజుల్లోనే ఇంత పెద్ద మొత్తంలో సమకూర్చి అందించామన్నారు. పాప శ్రీవల్లి పేరు మీద ఆ నగదును ఫిక్స్డ్ డిపాజిట్ చేశామన్నారు. కార్యక్రమంలో రామ్ రెడ్డి, పొడిశెట్టి వెంకన్న , మహేందర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రైతు పండుగ ప్రత్యక్ష ప్రసారం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రైతు సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్ నగర్ లో నిర్వహించ తలపెట్టిన రైతు పండుగ కార్యక్రమాన్ని బచ్చన్నపేట రైతు వేదికలో ప్రత్యేక్ష ప్రసారం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, రైతు బాంధవులు, రైతులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

Local News



# భోజనం రుచిగా ఉండాలి

- నాణ్యమైన సరుకులనే వినియోగించాలి
- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులకు అందించే భోజనం రుచిగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. జనగామ మండలంలోని శామీర్ పేట మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ను, జనగామ మున్సిపాలిటీ లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాజరు రిజిస్టర్ ని పరిశీలించి పనిచేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట సరుకుల స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి వంట గదిని సందర్శించి కూరగాయలు, వంట సరుకులను చెక్ చేశారు. వంట సరుకులను ఎక్కువ కాలం నిల్వ చేయరాదని, తాజా సరుకులనే తెప్పించాలన్నారు. నిరంతరం వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎండీడీవో సంపత్ కుమార్, రెసిడెన్షియల్ స్కూల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి




**పాలకుర్తి , మన చౌరాస్తా :** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తిలో శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన రైతు ఉద్యమ శ్రేయోభిలాషి, ప్రజాతంత్ర వాది రిటైర్డ్ ప్రొఫెసర్ మరిగంటి యాదగిరి చార్యులు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దమనకాండలో మరణించిన వారికి, ఉక్రెయిన్ రష్యా దాడుల్లో మరణించిన వారికి, ప్రకృతి విపత్తులలో మరణించిన వారికి 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రవి మాట్లాడుతూ ప్రజలు పోరాటాల ద్వారా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకునే పాలక వర్గాల మెడలు వంచి తమ హక్కులను సాధిస్తారని, ఇందుకు లగచర్ల ఘటనే ఉదాహరణ అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వనం సుధాకర్, కుంభం సుకన్య, పెద్దారపు రమేష్, ఎన్ రెడ్డి హంసా రెడ్డి, మంద రవి, నజీర్, వంగాల రాగసుద, మాలోతు జబ్బార్ నాయక్, కంచ వెంకన్న, గుండె బోయిన చంద్రయ్య, తాండ్ర కళావతి, మాస్ సావిత్రి పాల్గొన్నారు.

# ఘనంగా నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు

## – ప్రతిభ కనబర్చిన జనగామ విద్యార్థులు




**వరంగల్, మన చౌరాస్తా :** గ్రేటర్ వరంగల్ 47వ డివిజన్ పరిధిలోని నారాయణ ఇ టెక్నో స్కూల్లో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంఈఓ మనోజ్ కుమార్, డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, జోనల్ డీజీఎం రిజ్వానా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. డీజీఎం రిజ్వానా మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని అన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గొలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. వరంగల్ జోనల్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, చెస్ పోటీల్లో జనగామ బ్రాంచ్ ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీలను కైవసం చేసుకుంది. కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి, కోఆర్డినేటర్లు సాయి కృష్ణ, శ్యామల, శిరీష, ప్రిన్సిపాల్స్ ఫర్హానా, అనిత, అలేఖ్య, ఆర్ ఎస్ టి లక్పతి, ఆర్ ఎన్ డి కమలాకర్, పీఈటీలు ఘన శ్యామ్, మహేష్, సుమన్ గౌడ్ పాల్గొన్నారు.



# వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**పాలుకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల వసతి గృహాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుక్రవారం అకస్మికతకంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సదుపాయాలు, చెత్త, మరుగుదొడ్ల, నిర్వహణ, సిజనల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మెడికల్ సూపరింటెండెంట్



పాలకుర్తి సీహెచ్‌సీలో పనిచేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పరమేశ్వరి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌కు సంబంధించిన పలు విషయాలను ఎమ్మెల్యేతో మాట్లాడినట్టు ఆమె తెలిపారు.



# రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

హనుమకొండ, మన చౌరాస్తా : రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ స్టేడియంలో జరిగే అండర్ 14, 17 రాష్ట్ర స్థాయి పాఠశాలల బాల బాలికల టెన్నిస్ జట్లను ఎంపిక చేసినట్లు హనుమకొండ స్కూల్ గేమ్ సెక్రెటరీ దశ్రు నాయక్ తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో బి.అభినవ్(ప్రభుత్వ జూనియర్ కాలేజ్ హనుమకొండ), ఎం.అక్షయ్ (ఎస్ఎమ్ఆర్ హై స్కూల్), ఎం.శ్రీహస్ (శ్రీ చైతన్య ఐపీఎల్ స్కూల్), టి. అనీష్ రాజ్ (స్కిల్ స్ట్రోక్ హై స్కూల్), ఎం. మల్లికార్జున్ (హనుమకొండ ప్రభుత్వ హైస్కూల్), బాలికల విభాగంలో భవానీ ఎస్ పాటిల్ ( సెయింట్ పీటర్స్ హై స్కూల్ ), జే.ఆర్యతి చంద్ర వేద ( తేజస్విని హై స్కూల్ ), వి.శ్రీవాణి (సాయి శివాని జూనియర్ కాలేజ్), ఎన్. ప్రసన్న (వంచనగిరి మోడల్ స్కూల్), పి.తూజ రాణి (వంచనగిరి మోడల్ స్కూల్ ) ఎంపికయ్యారని చెప్పారు. అలాగే అండర్ 14 బాల బాలికల విభాగంలో డి. దైవిక్ ( వరంగల్ పబ్లిక్ స్కూల్ ), బీ.కృష్ణ విహారి (వరంగల్ పబ్లిక్ స్కూల్), డి.నిత్య సారూన్ (వరంగల్ పబ్లిక్ స్కూల్) ఎంపికయ్యారని తెలిపారు.

Health special



# యువతలో గుండెపోటు ఎందుకు?

మారుతున్న జీవన విధానంలో గుండెపోటుతో మరణించే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం లైఫ్ స్టైల్ కారణంగా గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. ఇప్పుడున్న రోజుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇటీవల కాలంలో గుండెపోటుతు మరణించే వారి సంఖ్య పెరిగిపోతోంది. గుండెపోటు ఎప్పుడు వస్తుందో? తెలియని పరిస్థితి. యువకులను సైతం వదలడం లేదు. ఆరోగ్యంగా ఉన్నారనుకున్న సెలబ్రెటీలు, క్రికెట్ ప్లేయర్లు దీనిబారిన పడుతున్నారు. తాజాగా పుణె వేదికగా ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఓ క్రికెటర్ మైదానంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. అప్పటివరకూ తమతో ఆడుతున్న ఆటగాడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. 35 ఏళ్ల ఇమ్రాన్ పటేల్ ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చాడు. కాసేపటికే ఎడమవైపు ఛాతీలో నొప్పిగా ఉందంటూ సహచరులకు చెబుతూ కుప్పకూలాడు. అయితే గుండెపోటుతో మృతి చెందినట్లు గుర్తించారు. ఇలా యువతలో గుండెపోటు కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ రోజుల్లో యువతలో గుండెపోటు కేసులు ఎందుకు పెరుగుతున్నాయి.. దాని నుండి రక్షించువడం ఎలా అనే విషయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యం.

**ఒత్తిడి :** బాధ్యతల బారం లేదా ఇతర కారణాల వల్ల, ఎవరైనా ఒత్తిడి సమస్యను ఎదుర్కొంటారు. ఒత్తిడి పెరిగితే అది డిప్రెషన్ వంటి తీవ్రమైన సమస్యలను సృష్టిస్తుంది. దీంతో చాలా మంది యువతలో ఒత్తిడి కారణంగా గుండెపోటు వస్తుంది.

**ఆహారం :** ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో చాలా మంది యువత తమ ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. చాలా సార్లు ప్రజలు బయటి నుంచి జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్ తినేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ రకమైన ఆహారం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో అధిక బీపీ, ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీని కారణంగా గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**జీవనశైలి :** నేటి యువతలో చాలా మంది జీవనశైలి చాలా చెడిపోయింది. సరైన సమయంలో నిద్రపోకపోవడం, సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. బిజీ షెడ్యూల్ కారణంగా యువత తమ జీవనశైలిపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. అయితే ఈ పొరపాటు మిమ్మల్ని గుండెపోటు పేషెంట్‌గా మార్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రోజుకో స్పూన్ తింటే
# అమేజింగ్ అంతే



ఆరోగ్యమే మహాభాగ్యం ఉంటారు. చలికాలంలో పొడి వాతావరణం కారణంగా రోగాల బారిన పడే ప్రమాద ముంది. జలుబు,దగ్గు, శ్వాసకోస సమస్యలు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇంకా ఎన్నో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఆరోగ్యమే మహాభాగ్యం ఉంటారు. ప్రస్తుత బిజీ లైఫ్ స్టైల్‌లో ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. ఆరోగ్యంగా లేకపోతే ఆర్థికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎన్నో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఇలాంటి ఆరోగ్య సమస్యలకు చెక్ చెప్పడానికి కొన్ని ఫుడ్స్ ఆహారంలో చేర్చుకోవాలి. వంటింట్లో దొరికే చిన్న గింజలు ఎన్నో వ్యాధుల పనిపడతాయి. చలికాలంలో ఈ గింజల్ని ఒక స్పూన్ తింటే చాలు. కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు షుగర్ కూడా కంట్రోల్ అవుతుంది. ఇంతకీ ఆ గింజలు ఏంటి అనుకుంటున్నారు. నువ్వులు. అవును మీరు వింటున్నది నిజమే.! ఈ చిన్న గింజల్లో ఒక గ్లాస్ పాల కంటే 8 రెట్లు కాల్షియం ఎక్కువగా ఉంది. కాల్షియం మాత్రమే కాదు. నువ్వుల్లో ప్రోటీన్, ఫైబర్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, ఐరన్, జింక్స్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నువ్వుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. చలికాలంలో ఒక స్పూన్ నువ్వులు తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం. నువ్వులు.. కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో ముందుంటాయి. అధిక కొలెస్ట్రాల్, ట్రైగ్లెజరిడ్‌తో బాధపడేవాళ్లు.. మీ ఆహారంలో నువ్వులు భాగం చేసుకుంటే సరిపోతుంది. హార్ట్ పేషెంట్ అయితే.. నువ్వులు తీసుకోవడం చాలా లాభం. ఎందుకంటే నువ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గిస్తాయి.

ఇది కొత్తిమీర కాదు.. అలాంటిదే..

# ఎన్నో లాభాలు..!



ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి.. దీని వల్ల గుండెల్లో మంట, నెర్వస్‌నెస్, విశ్రాంతి లేకపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. దీనిని నివారించడానికి తక్షణ చికిత్స చాలా ముఖ్యం. ప్రతిరోజూ రాత్రి ఒకగ్లాసు సెలరీ జ్యూస్‌ను తాగితే చాలా సమస్యల నుంచి బయటపడొచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. అసలు సెలరీ అంటే ఏమిటి..? సెలరీ అనేది అపియాసి కుటుంబానికి చెందిన కూర. ఇది చూడడానికి కొంచెం కొత్తిమీరలా ఉంటుంది. సెలరీలో పోషకాలు అధికంగా ఉంటాయి. దీనిలో ఫైబర్ కంటెంట్ సమృద్ధిగా ఉంటుంది. విటమిన్ కె, సి, పొటాషియం, ఫోలేట్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సెలరీ జ్యూస్ తరచూ తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని, శరీరానికి కావలసిన పోషకాలు అందించవచ్చని నిపుణులు అంటున్నారు. సెలరీ జ్యూస్‌ని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల పొట్ట సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. సెలెరీలో థైమోల్ అనే మూలకం ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. సెలెరీ కడుపులో ఉన్న యాసిడ్‌ను తటస్థీకరించడంలో సహాయపడుతుంది. ఇది గుండెల్లో మంట, అసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. సెలెరీ ఎసిడిటీ సమయంలో కలిగే భయం, విశ్రాంతి లేకపోవడం నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. ఊబకాయంతో బాధపడేవారికి కూడా సెలెరీ చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. ఇదీ కాకుండా, ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో కూడా సెలెరీ సహాయపడుతుంది. ఇది మాత్రమే కాదు, సెలెరీ మహిళలకు కూడా చాలా ఉపయోగకరం. ఇది పీరియడ్స్ సమయంలో కడుపు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. సెలెరీలో అధిక స్థాయిలో ఆండ్రోస్టెనోన్, ఆండ్రోస్టెనాల్ ఉన్నాయి. ఇవి పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పురుషులు, స్త్రీలలో సంతానోత్పత్తిని పెంచుతాయి. మీరు జుట్టు సమస్యలతో బాధపడుతుంటే మీరు ఆకుకూరలను తినవచ్చు. ఇది జుట్టును బలంగా, మందంగా చేస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ శరీరంలో మంటను నివారిస్తుంది. అనారోగ్యాల నుండి రక్షిస్తుంది. ఈ ఆకుపచ్చ కూరగాయలలో యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి ఆక్సీకరణ నష్టాన్ని నివారిస్తాయి.జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇందులో అపియుమాన్ అనే సమ్మేళనం ఉంది. ఇది అల్సర్, జీర్ణ సమస్యల వంటి కడుపు సమస్యలను నివారిస్తుంది. అధ్యయనాల ప్రకారం, సెలెరీ రక్తపోటు స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుంది.

# తుది షెడ్యూల్‌లో
# హరి హర వీరమల్లు



మన చౌరాస్తా, సినిమా : పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. విజయవాడ పరిసర ప్రాంతాల్లో తుదిషెడ్యూల్‌ను తెరకెక్కించేందుకు నిర్మాత ఎఎం రత్నం, దర్శకుడు జ్యోతికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. హాలీవుడ్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్ర యూనిట్ అక్టోబర్‌లో తెరకెక్కించింది. 500 మంది వరకూ ఈ షూట్‌లో పాల్గొన్నారు. ఆఖరి షెడ్యూల్ శని, ఆదివారాల్లో తెరకెక్కించనున్నారు. ఈ షెడ్యూల్‌లో కూడా భారీ సన్నివేశాలు చిత్రీకరించబోతున్నారు. పవన్ కళ్యాణ్‌తో పాటుగా 200 మంది ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ మొత్తం పూర్తికానుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీలకపాత్ర పోషిస్తున్నారు. అనుపమ్‌ఖేర్, నాజర్, రఘుబాబు తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఛాయాగ్రాహకుడు మనోజ్ పరమహంస కెమెరా, తోట తరణి కళా దర్శకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ శ్రీనివాస్ మోహన్ సాంకేతిక, ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందజేస్తున్నారు. ఎఎం రత్నం సమర్పణలోనే మెగా సూర్యప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ యోధుడిగా ఈ సినిమాలో నటిస్తున్నారు. మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

# Varsha

## Digitals

మీ పుట్టిన రోజు, పెళ్లిరోజుల శుభాకాంక్షలు.. నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ మరియు క్యాలెండర్లను ఆకర్శనీయంగా డిజైనింగ్ చేయబడును.. వివరాలకు ఈ కింది నంబర్లను సంప్రదించండి.

**8555 800 812**

**9676 400 812**

